సాక్షి పెద్దపల్లి

శనివారం | 14 | జనవరి | 2023



సకినాలు కాలుస్తున్న లక్ష్మి

సంక్రాంతికి ఆర్డర్లు ఫుల్

సంక్రాంతి వచ్చిందంటే మాకు చేతినిండా పని ఉంటుంది. ఖాళీగా ఉండకుండా ఇంటిపట్టున ఉంటూ ఏదైనా పని చేయాలనుకున్నప్పుడు ఆర్డర్ మీద అప్పాలు చేయాలన్న ఆలోచన వచ్చింది. ప్రత్యేకంగా బ్రాండ్ లేకుండానే తెలిసిన వారి నుంచి ఆర్డర్లు తీసుకుని క్వాలిటీతో సమయానికి ఇవ్వడంతో రోజురోజుకూ గిరాకీ పెరిగింది. అప్పాలు చేయడంతో వచ్చిన పైసలతోనే మా ఇద్దరు అమ్మాయిలను అమెరికా పంపించా.

– తానిపర్తి లక్ష్మి, గ్రూప్ లీడర్, సుల్తానాపూర్

- పండుగకు పిండివంటలతో ఉపాధి
- హోంఫుడ్స్‌కు ఖండాంతరాల్లో డిమాండ్
- చిన్నాపెద్ద కార్యక్రమాలకు భారీగా ఆర్డర్లు
- ఇండ్లలో సహజసిద్ధంగా పిండివంటల తయారీ
- ఉమ్మడి జిల్లాలోని మహిళల స్వయంకృషి



సంక్రాంతి స్పెషల్

విలేజ్ నుంచి విదేశాలకు..

నోరూరిస్తున్న సంక్రాంతి ఘుమఘుమలు

సంక్రాంతి అంటేనే పిండి వంటలు. వారం రోజుల ముందు నుంచే ఇళ్లంతా ఘుమఘుమలు. సకినాలు, గారెలు, అరిసెలు, లడ్డూలు ఇలా తీరొక్క రకాలు నోరూరిస్తుంటాయి. చుట్టుపక్కల వారంతా కలిసి ఆడుతూ.. పాడుతూ ఒకరికొకరు సాయంగా ఉంటూ గతంలో పిండి వంటలు చేసుకునేవారు. ఎక్కడో దూరంగా ఉంటున్న ఆత్మీయులకు పంపించేవారు. ఉరుకులు, పరుగుల జీవితంలో పెద్దమొత్తంలో పిండివంటలు ఇప్పుడు సాధ్యం కావడం లేదు. దీంతో చాలా మంది హోంఫుడ్స్‌ను ఆశ్రయిస్తుండగా.. ఇన్నాళ్లు పట్టణాలకే పరిమితమైన ఇంటివంటలు గ్రామాల్లోనూ విశేష ఆదరణ పొందుతున్నాయి. క్వాంటిటీ, క్వాలిటీయే లక్ష్యంగా తయారు చేసిన వంటకాలను దేశవిదేశాల్లోని మన తెలంగాణవాసులు ఎంతో ఇష్టంగా ఆరగిస్తున్నారు. పండుగ సమయంలోనే కాదు.. ఏడాది మొత్తం గిరాకీ ఉంటోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లోని పలు హోంఫుడ్స్, మహిళలకు లభిస్తున్న ఉపాధిపై సంక్రాంతి సందర్భంగా కథనం..

ఆర్డర్లపై తయారీ..



పిండి వంటలు చేస్తున్న పద్మ

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణంలోని గణేశ్‌నగర్‌కాలనీకి చెందిన తాడిశెట్టి పద్మ సర్వపిండి సెంటర్ నిర్వహిస్తోంది. పండుగలు, శుభకార్యాలకు ఆర్డర్లపై సకినాలు, మడుగులు, ఖార్జా, బాదుషా తదితర పిండి వంటకాలు చేసి అందిస్తోంది. 10 సంవత్సరాలుగా పిండి వంటలు చేస్తూ మరో ఇద్దరికి పని కల్పిస్తోంది. పండుగ వేళల్లో ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లో ఉద్యోగంలో ఉన్నవారికి పంపిస్తున్నారు. స్వీట్లు కేజీ రూ.300, పిండి వంటలు కేజీ రూ.250 చొప్పున అందిస్తున్నామని పద్మ పేర్కొంటోంది.

అప్పాల 'సుల్తానాపూర్'



సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తానాపూర్‌లో ఏడాదంతా అప్పాల ఘుమఘుమలు వస్తూనే ఉంటాయి. 15ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన లక్ష్మి లీడర్‌గా పదిమంది సభ్యులతో గ్రూపుగా ఏర్పాటయ్యారు. చిన్నమొత్తాలతో వ్యాపారం చేయాలనుకున్నారు. గ్రూప్‌లోని ఓ సభ్యురాలి ఇంట్లో వివాహ వేడుకకు పెద్దమొత్తంలో పిండివంటలు తయారు చేయాల్సి వచ్చింది. కావాల్సిన సారెను అందరూ కలిసి సిద్ధం చేశారు. తరువాత పిండివంటల తయారీ తెలిసిన పని, తక్కువ పెట్టుబడి కావడంతో వ్యాపారం ప్రారంభించాలని అనుకున్నారు. అలా ప్రారంభమై ఇప్పుడు ఏటా రూ.60 లక్షల టర్నోవర్ అవుతోంది. అప్పులు తీర్చుతూ, తమ పిల్లలను విదేశాల్లో చదివిస్తున్నారు. మరో 50మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ బిజినెస్ బాగుండటంతో ఇదే వృత్తిగా ఆ గ్రామంలో ఏడు గ్రూప్‌లు ఏర్పడ్డాయి. వీటికింద సుమారు 400మందికి పైగా సహాయకులు ఉపాధి పొందుతున్నారు. 32 వరుసలతో చక్రాల సకినాలు, కిలో పరిమాణంలో లడ్డూ, కరిజ, బెల్లం అరిసెలు, నువ్వుల లడ్డూ, మురుకులు, చెగోడీలూ, గవ్వలు, ఖారా, ఇతరత్రా వంటకా లను పెద్ద ఎత్తున తయారు చేయడం వీరి ప్రత్యేకత. వీరి అప్పాలు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలతోపాటు, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలాంటి దేశాలకు ఆర్డర్‌పై వెళ్తుంటాయి. దీంతో సుల్తానాపూ ర్ ఇప్పుడు అప్పాలపూర్‌గా మారింది.

పిండి వంటలకు కేరాఫ్ గూడూరు



సకినాలు చేస్తున్న మహిళలు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం గూడూరు తెలంగాణ పిండివంటలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. గ్రామానికి చెందిన చీటి వసంత విదేశాల్లో ఉండే బంధువుల కోసం ఐదేళ్ల క్రితం సకినాలు, గారెలు, రవ్వలడ్డూ, సర్వపిండి, నువ్వుల లడ్డూ తయారుచేసి పంపించారు. అవి వారికి నచ్చడంతో తరుచూ తయారు చేయమని కోరారు. దీంతో చీటి వసంత, కారంగుల రజనీ మరో ఇరవై మందికి ఉపాధి కల్పిస్తూ ఐదేళ్లుగా తెలంగాణ పిండి వంటలు తయారు చేస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌తోపాటు గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు ఆర్డర్‌పై తీసుకెళ్తున్నారు. హైదరాబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి, ముంబయి నుంచి కూడా ఏడాదిపొడవునా ఆర్డర్లు వస్తున్నాయి. ఇవేకాకుండా చికెన్, మటన్, ఫిష్ పచ్చళ్లు అందిస్తున్నారు. సకినాలు, గారెలు, లడ్డూ కిలోకు రూ.300 చొప్పున అందిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా నెలరోజుల నుంచే ఆర్డర్లు పంపించామని చెబుతున్నారు.

సంప్రదాయ వంటలు



ఇంట్లో ఖాళీగా ఉండలేక బంధువుల కోసం సకినాలు, గారెలు అందించా. రుచి నచ్చి చాలామంది పిండి వంటకాలు కావాలని అడిగారు. అలా ఐదేళ్ల క్రితం మొదలైన పిండి వంటల తయారీ నిత్యం కొనసాగుతోంది. సకినాలు, సర్వపిండి, గారెలు, లడ్డూలు, అరిసెలు తయారు చేసి ఇస్తున్నాం. ప్రస్తుతం ఆర్డర్లు బాగానే వస్తున్నాయి.

– చీటి వసంత, గూడూరు

సర్కారు సాయం చేయాలి



సహజసిద్ధంగా లభించే పిండిపదార్థాలతో వంటకాలు తయారు చేస్తున్నాం. ప్రభుత్వం సాయం అందిస్తే పిండివంటకాల అవుట్‌లెట్లు పెడతాం. మరింత మందికి ఉపాధి కల్పిస్తాం. సంక్రాంతి పండగే కాదు సంవత్సరమంతా సకినాలు, గారెలు, సర్వపిండి, చెగోడీలకు గిరాకీ ఉంటుంది. నెలకు రూ.30వేల వరకు సంపాదిస్తున్నాం.

– కారంగుల రజని, గూడూరు

19 ఏళ్లుగా ఇంటి వంటలు



గారెలు తయారు చేస్తున్న మహిళలు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని పవర్‌హౌజ్‌కాలనీలోని శ్రీసాయి తెలంగాణ పిండివంటల టేస్టే సపరేటు అంటున్నారు స్థానికులు. తానిపర్తి రామ్మోహన్‌రావు ఆయన భార్య జయశ్రీ కలిసి పండివంటల కేంద్రాన్ని వారి ఇంట్లోనే నిర్వహిస్తూ 20మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. చకినాలు, గారెలు, అరిసెలు, చగోడిలు, నువ్వుల ముద్దలు, లడ్డులు, కారపూసలు(జంతికలు), కరిజలు, పల్లీలడ్డులు, బక్షాలు, సర్వపిండి తయారు చేస్తున్నారు. వీటిని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని స్వీట్‌హౌజ్‌లు, బేకరీలు, సూపర్ మార్కెట్‌లు, కిరాణం దుకాణాలతోపాటు హైదరాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల తదితర జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయ్, యుకే తదితర దేశాలకు ఎన్ఆర్ఐ ప్యాకింగ్‌లో తెలుగువాళ్లకు కూడా పంపిస్తున్నట్లు రామ్మోహన్‌రావు తెలిపారు.

పప్పు, జొన్నరొట్టెతో ప్రారంభించాం..



2003లో పప్పు, జొన్న రొట్టెతో ప్రారంభించాం. 19 ఏళ్లుగా పిండి వంటలు తయారు చేస్తున్నాం. మాతోపాటు మరో 20 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. సంక్రాంతికి ఎక్కువగా ఆర్డర్లు వచ్చాయి. విదేశాలకు కూడా మేం తయారు చేసిన పిండి వంటలను తీసుకుపోతుండడం ఆనందంగా ఉంది. సంక్రాంతికి 15 రోజుల ముందు నుంచే ఆర్డర్లు రెడీ చేశాం.

– తానిపర్తి రామ్మోహన్‌రావు, జయశ్రీ

'మంథని' రుచులు

మంథని: మంథనికి చెందిన పలువురు మహిళలు స్వయం ఉపాధి కోసం పిండి వంటలు తయారు చేస్తున్నారు. వీటిని విదేశాల్లోని తమవారికి పంపిస్తుంటారు. సంక్రాంతి పండగ పిండి వంటలు పదిహేను రోజుల ముందు నుంచే అమెరికా, లండన్, సింగపూర్, ఆస్ట్రేలియాతో ప్రపంచంలోని ఆయా దేశాలకు చేరాయి. మంథనిలో కారపు చకినాలు ప్రత్యేకం. పచ్చి మిరపకాయల ముద్ద, కోతిమీర, నెయ్యి, వెన్నతో తయారు చేసే కారపు చకినాలకు మంచి గిరాకీ ఉంటుంది. వీటిని చాలామంది కొనుగోలు చేసుకెళ్తుంటారు. మోతీచూర లడ్డూ కూడా ఇక్కడ స్పెషల్. ఏ రకం పిండి వంటలైనా కిలో రూ.300 నుంచి రూ.400కు విక్రయిస్తుంటారు. 'మేము తయారు చేసిన పిండివంటలు కిలోకు రూ.300 చొప్పున అమ్ముతున్నాం. తయారీ ఖర్చు రూ.250 వరకు ఉంటుంది. కిలోకు యాభై రూపాయలు మిగులుతాయి. పండగ సమయంలో గిరాకీ ఎక్కువగా ఉంటుంది. మిగతా రోజుల్లో తక్కువే. విదేశాలకు పంపేవారు ముందుగానే ఆర్డర్ ఇస్తారు.' అని వాణి లక్ష్మీ నారాయణ స్వగృహఫుడ్స్ నిర్వాహకురాలు బండారి సునీత వివరించారు.



తయారు చేసిన పిండి వంటలతో బండారి సునీత

భోగి.. వైభోగం

- సంబరాలకు ఉమ్మడి జిల్లాలో సర్వం సిద్ధం
- రంగవల్లులు.. డూడూ బసవన్నలు ముస్తాబు

కరీంనగర్‌కల్చరల్/ బోయినపల్లి (చొప్పదండి): మూడురోజుల ముచ్చటైన వేడుక సంక్రాంతి సంబరాలకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు. నేటి భోగితో ప్రారంభమయ్యే పండుగ జోష్ కనుమ వేడుకతో ముగియనుంది. భోగి మంటలు వేసి ఆడిపాడేందుకు యువత, చిన్నారులు రెడీ అవుతున్నారు. ఇంటివాకిళ్ల రంగవల్లులతో ముస్తాబుకానున్నాయి. తాటాకులతో భోగి మంట వేస్తారు. ఆ మంటల్లో ముందుగా సిద్ధం చేసుకున్న పాత వస్తువులు వేస్తారు. మంటల మధ్యన నీటితో నింపిన కుండలను పెడతారు. ఆ మంటలకు కాగిన వేడినీటితో భోగి స్నానాలు చేస్తారు. భోగి మంటల్లో పాత వస్తువుల వేయడం వల్ల పీడతొలగి భాగ్యాల్ని అందిస్తుందని విశ్వాసం. భోగి రోజు పిల్లలకు రేగుపండ్లు తలపై పోస్తారు. సాయంత్రం చుట్టుపక్కల పెద్దవాళ్లను పిలిచి వారితో పిల్లలకు దిష్టి తీయిస్తారు. గుప్పిట నిండా రేగుపండ్లు, చిల్లరనాణేలు, బంతిపూల రెక్కలు, చెరకు ముక్కలు పిడికిలో తీసుకుని పిల్లలకు మూడుస్లారు దిష్టితీస్తారు. సంక్రాంతికి పంటలు చేతికందిన రైతులు రెండోపంట వేసుకునేందుకు తమ పొలాల్లో కొంత మేరకు నీరు పారించి భూమిని తడుపుతారు. దీన్ని పిలకవేయడం అంటారు. భోగి సందర్భంగా మహిళలు ఇంటిముంగిళ్లను రంగవల్లికలతో స్వరాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు. ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు, నవధాన్యాలు ముగ్గుమధ్యలో పెడతారు. ముత్తయిదువులు వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. శ్రీరంగనాథుడిని గోదాదేవి వివాహం చేసుకున్నది భోగిరోజు కావున.. వైష్ణవ ఆలయాల్లో భోగిరోజు గోదాదేవి కల్యాణం నిర్వహిస్తారు. కొన్నిప్రాంతాల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేసి ముత్తయిదువులను పేరంటానికి పిలిచి సత్కరిస్తారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా సంక్రాంతిని మూడురోజులు పాటు ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధం అవుతున్నారు.



న్యూస్‌రీల్

గోదాదేవి కల్యాణం



కల్యాణ వేడుకలో భక్తులు

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్ ఆవరణలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీగోదారంగనాయకస్వామి కల్యాణ వేడుకను అర్చకుడు రంగాచార్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. టీఎన్‌జీఓల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొంకూరి శంకర్, రాజనరేందర్‌తో పాటు పలు శాఖల అధికారులు, సిబ్బంది, రంగంపల్లి, పెద్దకల్వల, పెద్దబొంకూర్‌కు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఫిబ్రవరి 4 నుంచి 11 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ బొంకూరి శంకర్ తెలిపారు. భక్తులు, దాతలు సహకరించాలని కోరారు.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సుబ్రతమండల్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సుబ్రత మండల్ శుక్రవారం అదనపు పదవీ బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ రీజియన్-1 ముంబై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుబ్రతమండల్‌కు సదరన్ రీజియన్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ న్యూఢిల్లీ కార్పొరేట్ సెంటర్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన విధుల్లో చేరినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కాగా సుబ్రతమండల్ ఎన్ఐటీ దుర్గాపూర్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి 1985లో ఎన్టీపీసీలో ఎగ్జిక్యూటివ్ ట్రెయినీగా విధుల్లో చేరారు. పలు ప్రాజెక్టుల్లో 37 ఏళ్లకు పైగా వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు.

రైళ్లలో ప్రయాణికుల రద్దీ



కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌లో రద్దీ

రామగుండం: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 16 వరకు సెలవులు ప్రకటించడంతో పలువురు దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్, వరంగల్, కాజీపేట నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్లే భాగ్యనగర్, కాగజ్‌నగర్, ఇంటర్‌సిటీ, సింగరేణి, రామగిరి, పుష్‌పుల్, దానాపూర్, తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. సాధారణ బోగీల్లో కనీసం అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. కాగా ఏటా సంక్రాంతి పండుగకు కేవలం ఆంధ్రాకు మాత్రమే ప్రత్యేక రైళ్లను నడిపిస్తుండగా.. తెలంగాణలో సైతం కోల్‌బెల్ట్ ఏరియాకు కూడా సంక్రాంతి, దసరా పండుగలను పురస్కరించుకొని ప్రత్యేక రైళ్లను నడిపించేందుకు ఎంపీలు దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



నీరు రాని బోరును చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిరూరల్: బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పాలన అస్తవ్యస్తంగా మారిందని, మున్సిపల్ పాలన కూడా గాడి తప్పిందని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. పెద్దపల్లిలోని 30వ వార్డులో శుక్రవారం గడపగడపకూ కాంగ్రెస్ నినాదం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా విజయరమణారావుతో పాటు నాయకులు సయ్యద్ మస్రత్, సంపత్, సుభాష్, శ్రీమాన్, బి.సురేశ్ గౌడ్, సుధాకర్‌రెడ్డి, కొలిపాక శోభ, ఈర్ల స్వరూప, కలీం, జగదీశ్ తదితరులతో కలిసి కాలనీవాసులతో మాట్లాడారు. పెద్దపల్లి మున్సిపల్ అధికారులు, పాలకులు ప్రజాసంక్షేమాన్ని గాలికొదేశారని, బోరుబావిలో చుక్క నీరు రావడంలేదని, అయినా మరమ్మతులు చేసే దిక్కులేదన్నారు. రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా మారాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి జరుగుతుందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కే అండగా నిలవాలని కోరారు. నాయకులు సురేశ్, నదీం, మెరాజ్, హకీం, అబ్బు, సంపత్ తదితరులున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



ట్రోఫీ అందజేస్తున్న జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌కుమార్

పాలకుర్తి(రామగుండం): క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పాలకుర్తి మండలం ముంజంపల్లి గ్రామంలో శ్రీవెంకటేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడురోజులుగా జరుగుతున్న అంతర్‌రాష్ట్ర కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీవన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని గెలుపు దిశగా అడుగులు వేయాలని సూచించారు. మొత్తం 36 జట్లు పాల్గొన్న టోర్నమెంట్‌లో ముంజంపల్లి జట్టు ప్రథమ బహుమతి, కరీంనగర్ జట్టు ద్వితీయ బహుమతి సాధించగా వారికి ట్రోఫీతో పాటు నగదు బహుమతిని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శైలేందర్‌రెడ్డి, సింగిరెడ్డి లింగారెడ్డి, బాలసాని మల్లేశం, గాజుల విజయ్, మేకల సంతోష్‌యాదవ్, సురేశ్‌యాదవ్, వ్యాళ్ల అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సేవా సమితి ఆర్జీ- 1 ఆధ్వర్యంలో 180 మంది అభ్యర్థులకు ఉచితంగా ఫిజికల్స్ ఈవెంట్స్‌లో శిక్షణ అందించగా 127 మంది క్వాలిఫై అయినట్లు జీఎం తెలిపారు. వారికి రాత పరీక్షల కోసం ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 17లోగా జీఎం ఆఫీస్ పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు 94943 54806 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అరకొర సిబ్బంది.. నిర్వహణకు ఇబ్బంది

- ఆరేళ్ల క్రితం జిల్లాలో 3 బ్లడ్‌బ్యాంకులు ఏర్పాటు
- పూర్తి స్థాయిలో అందని సేవలు



పెద్దపల్లిలోని రక్తనిధి కేంద్రం



డబ్బాలోనే ప్లేట్‌లెట్స్ కౌంట్ మిషన్

పెద్దపల్లిరూరల్: అత్యవసర వైద్యసేవలు పొందేందుకు ఆసుపత్రులకు వచ్చిన వారికి అవసరమైన గ్రూప్ రక్తం కావాలంటే పొరుగు జిల్లాలకు పరుగులు తీయాల్సిందే. జిల్లా కేంద్రం పెద్దపల్లితో పాటు మంథని, గోదావరిఖనిలో బ్లడ్‌బ్యాంకు సెంటర్లను 2017లో మంజూరు చేసిన ప్రభుత్వం ఒక్కో సెంటర్ భవన నిర్మాణానికి రూ.2కోట్ల చొప్పున కేటాయించి పనులు పూర్తి చేసింది. గోదావరిఖనిలో రక్తనిధి కేంద్రం అందుబాటులోకి రాగా, పెద్దపల్లిలోని బ్లడ్ బ్యాంకును 2020 నవంబర్ 16న ప్రారంభించారు. మంథనిలో బ్లడ్ బ్యాంకు భవనం నిర్మాణం పూర్తికాగా కొద్ది రోజుల క్రితమే లైసెన్స్ జారీ అయింది. పెద్దపల్లిలో అరకొర సిబ్బందితో నెట్టుకు వస్తుండగా, మంథని బ్లడ్‌బ్యాంకుకు గోదావరిఖని నుంచి తాత్కాలికంగా డెప్యూటేషన్‌పై ఇద్దరిని పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

ఒక్కరిద్దరితోనే..

రక్తనిధి కేంద్రాలు నిరంతరంగా (24గంటలు) తెరిచి ఉంచి ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి అవసరమైన రక్తాన్ని అందించాలి. ఇందుకు ఒక్కో బ్లడ్ బ్యాంకుకు ఓ వైద్యాధికారి, ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్‌లు, ల్యాబ్ అటెండెంట్, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, డాటాఎంట్రీ ఆపరేటర్, అంబులెన్సు, డ్రైవర్ అవసరం. కానీ తాత్కాలిక పద్ధతిన ఒకరిద్దరితోనే పనిచేయిస్తున్నారు. ఇక కేంద్రాల నిర్వహణకు అవసరమైన స్టేషనరీ కూడా లేక సిబ్బంది పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. బ్లడ్ బ్యాంకు సెంటర్లకు నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారానే నిధులు విడుదల కావాల్సి ఉంటుందని ఓ వైద్యాధికారి తెలిపారు. కేంద్రాల నిర్వహణకు అవసరమైన సిబ్బందితో పాటు స్టేషనరీని అందుబాటులో ఉంచేలా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

డబ్బాలోనే 'ప్లేట్‌లెట్స్ కౌంట్ మిషన్'

రక్తనిధి కేంద్రానికో దాదాపు రూ.30లక్షల విలువగల ప్లేట్‌లెట్స్ కౌంట్‌మిషన్‌ను ప్రభుత్వం సమకూర్చింది. యంత్రం అందుబాటులో ఉండి కూడా రక్తకణాలు తగ్గినవారికి సేవలందక పొరుగు జిల్లాలకు వెళ్తున్నారు. అధికారులు యంత్రాన్ని వినియోగంలోకి తేవాల్సిన అవసరముంది.

అధికారులకు నివేదించాం



జిల్లాలోని గోదావరిఖని బ్లడ్ బ్యాంకు ద్వారా పూర్తిస్థాయి సేవలందుతున్నాయి. మంథని సెంటర్‌కు లైసెన్స్ మంజూరు కావడంతో గోదావరిఖని నుంచి తాత్కాలికంగా సిబ్బందిని పంపించి సేవలందిస్తాం. సెంటర్లకు అవసరమైన స్టాఫ్, స్టేషనరీ కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. – శ్రీధర్, డీసీహెచ్ఎస్, పెద్దపల్లి

సీహెచ్‌సీలు.. అన్నదాతలకు వరం

- జిల్లాలో 4 కేంద్రాలు
- అద్దెపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు
- రామగిరి కేవీకే వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ వినోద్‌కుమార్


డాక్టర్ వినోద్‌కుమార్


ముత్తారంలో పరికరాలు అందిస్తున్న అధికారులు (ఫైల్)

రామగిరి(మంథని): కస్టమ్ హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీలు) రైతులకు వరమని రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ టి.వినోద్‌కుమార్ తెలిపారు. వాటికి సంబంధించిన పలు అంశాలను ఆయన వివరించారు. వ్యవసాయమంటే ఎండ, వాన, చలి అనేది చూసుకోకుండా కష్టపడి పని చేయాలి. పురుగు మందులు, కూలీలు, ట్రాక్టర్ అద్దె, వ్యవసాయ యంత్రాల కోసం పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది. ఒకటి, రెండు ఎకరాల భూమిని సాగు చేసే చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు కొనుగోలు చేయాలంటే డబ్బులుండవు. ఈ సమస్యను అధిగమించడానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. పెద్దపల్లి జిల్లాలో ఇప్పటివరకు రామగిరి మండలం రత్నాపూర్, ముత్తారం మండలం ముత్తారం, హరిపురం, మంథని మండలం నాగారంలలో 4 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అద్దెకు వ్యవసాయ పరికరాలు..

ఉపాధిహామీ పథకం ప్రవేశపెట్టిన తర్వాత గ్రామాల్లో కూలీలకు కొరత ఏర్పడి, చిన్న, సన్నకారు రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని, రాష్ట్రంలో 31 కస్టమ్ హైరింగ్ సెంటర్లను కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ నిధులతో సెర్ప్ మంజూరు చేసింది. రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో ఒక మండలాన్ని ఎంపిక చేసి, ఒక్కో కేంద్రంలో రూ.22 లక్షలతో వ్యవసాయ యంత్రాలు, పరికరాలు రైతులకు అందుబాటులో ఉంచారు. అవసరమైనప్పుడు అన్నదాతలు వాటిని అద్దెకు తీసుకొని, వినియోగించుకోవచ్చు.

అందుబాటులోని యంత్రాలు..

కస్టమ్ హైరింగ్ సెంటర్లలో ట్రాక్టర్లు, కల్టివేటర్, పవర్ వీడర్, పవర్ టిల్లర్, టార్పాలిన్లు, పవర్ స్ప్రేయర్లు, సీడ్ కమ్ ఫర్టిలైజర్, డ్రిల్లర్, ట్రాక్టర్ ఆపరేటర్, రోటావేటర్లు, కలుపుతీత యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు వీటిని కొనుగోలు చేసుకోవాలని భావిస్తే అందుకు తగిన వెసులుబాటు, రాయితీలు కూడా కల్పిస్తారు. బయటితో పోలిస్తే వీటి అద్దె తక్కువగా ఉంటుంది.

పక్కాగా పర్యవేక్షణ

ప్రతీ కస్టమ్ హైరింగ్ సెంటర్‌లో ఆరుగురు సభ్యులతో వ్యవసాయ ఉత్పత్తిదారుల గ్రూపు ఏర్పాటు చేస్తారు. వీరు ఒక సీసీ, ఒక అకౌంటెంట్‌తో అద్దెకు ఇచ్చిన పనిముట్లపై వచ్చిన లావాదేవీలను పక్కాగా పర్యవేక్షిస్తారు.

మార్కెట్ ధరతో పోల్చితే తక్కువకే..

కేవలం సమాఖ్యల్లోని సభ్యులే కాకుండా, రైతులెవరైనా తమకు కావాల్సిన యంత్రాలు, పరికరాలను అద్దెకు తీసుకోవచ్చు. మహిళా సంఘాలకు, ఎఫ్‌పీవోలో సభ్యులుగా ఉన్న రైతులకు మార్కెట్ ధరలో 50 శాతానికి, సన్న, చిన్నకారు రైతులకు మార్కెట్ ధరలో కొంత తక్కువకు అద్దెకు ఇస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సెంటర్లు ఏర్పాటు కానున్నాయి.

అధిక దిగుబడులకు దోహదం

కస్టమ్ హైరింగ్ సెంటర్లను సెర్ప్ పరిధిలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థ, మండల, గ్రామ సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వ్యవసాయ పరికరాలు, యంత్రాలు అద్దెకు ఇవ్వడం వల్ల వచ్చే సొమ్ముతో రైతు సంఘాలు, ఎఫ్‌పీవోలు, సమాఖ్యలు ఆర్థికాభివద్ధి సాధిస్తున్నాయి. చిన్న, సన్నకారు రైతులు యాంత్రిక, శాస్త్రీయ పద్ధతుల్లో అధిక దిగుబడులు సాధించడానికి, సాగు విస్తీర్ణం పెంచుకోడానికి ఈ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI DIGITAL MEDIA GROUP
SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor
SUDHAKAR PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
95055 14424, 99124 40790
గమనిక : అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

క్లుప్తంగా

అనారోగ్య కారణాలతో ఒకరి ఆత్మహత్య


శంకరయ్య (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ పట్టణానికి చెందిన కొయ్యడ శంకరయ్య (55) ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. శంకరయ్య కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆసుపత్రులకు వెళ్లి, చికిత్స పొందినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంటి ఆవరణలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య అంజలి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

పత్తి క్వింటాల్ ధర రూ.8,011



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో శుక్రవారం పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.8,011, కనిష్ఠ ధర రూ.7,007, సగటు ధర రూ.7,961 పలికిందని ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

దుమ్ము లేస్తోంది..!

- ఓవర్‌లోడ్ ఇసుక లారీలతో దెబ్బతింటున్న రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న మానేరు పరిసర గ్రామాల ప్రజలు
- ఇళ్లలోకి దుమ్ము చేరుతున్న వైనం
- అధికారుల చర్యలు శూన్యం


సుల్తానాబాద్ రహదారిపై లారీల వెనక లేస్తున్న దుమ్ము

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఓవర్‌లోడ్ వాహనాలతో రోడ్లు దెబ్బతిని, దుమ్ము లేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. ఓదెల మండలం కనగర్తి, గుండ్లపల్లి, గుంపుల, గూడెం, కాల్వశ్రీరాంపూర్ మండలం చిన్నరాపల్లి, సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ తదితర గ్రామాల సమీపంలోని మానేరువాగు నుంచి ఇసుకను లారీలు, ట్రాక్టర్లలో అధిక లోడ్‌తో తరలిస్తుండటంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. స్థానికులతో పాటు ప్రయాణికులు సైతం అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే సుల్తానాబాద్ నుంచి పెద్దపల్లి వరకు రోడ్డు మార్గంలో కొన్ని పరిశ్రమలు కూడా కాలుష్యానికి కారణమవుతున్నాయి.

తూతూమంత్రంగా క్యూరింగ్

మానేరు నుంచి ఇసుకను లారీల ద్వారా తరలిస్తున్న యజమానులు లాభార్జనే తప్ప ప్రజారోగ్యాలను పట్టించుకోవడం లేదు. పెద్దపల్లి నియోజకవర్గంలోని ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల్లోని పలు గ్రామాల మానేరు వాగు ఇసుక రీచ్‌లను కైవసం చేసుకున్న కాంట్రాక్టర్లు లారీల ద్వారా హైదరాబాద్‌కు అధిక లోడ్‌తో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక లారీలు వెళ్లే రహదారులను నిత్యం నీటితో క్యూరింగ్ చేయాల్సి ఉంటుంది. తూతూమంత్రంగా క్యూరింగ్ చేస్తుండగా.. దుమ్ముతో వేగలేకపోతున్నామని ప్రజలు, వ్యాపారులు పేర్కొంటున్నారు. అలాగే రైస్‌మిల్లుల నుంచి వెలువడే దుమ్ము, ఊక కళ్లలో పడుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

చర్మ, శ్వాసకోశ వ్యాధులు..

దుమ్ముతో కూడిన వాతావరణంలో ప్రజలు అనారోగ్యం పాలవుతుంటే, ప్రకృతి తన సహజ స్థితిని కోల్పోతోంది. వాయు కాలుష్యంతో కళ్ల మంటలు, తుమ్ములు, చర్మ, శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని పలువురు అంటున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ముక్కు మూసుకోవాల్సిందే..



వ్యాపారం సాగాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. లారీలు వెళ్లినప్పుడు వెలువడే దుమ్ముతో జలుబు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయి. ఆసుపత్రికి వెళ్లినా తగ్గకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం సరికాదు. – తుమ్మ వెంకన్న, వ్యాపారి, సుల్తానాబాద్

అధికారులు పట్టించుకోవడం లేదు..



కలెక్టర్ మొదలుకొని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళ్లడం వల్ల దుమ్ము వచ్చి, ఇళ్లోల చేరుతోంది. ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని, దుమ్ము రాకుండా చర్యలు తీసుకోవాలి. – ఆరేపల్లి రాహుల్, సుల్తానాబాద్



ధర పతనం.. చేలల్లోనే తెల్లబంగారం

పెద్దపల్లిరూరల్: పత్తి ధర రోజురోజుకూ పతనమవుతోంది. ఈ సీజన్‌లో క్వింటాల్‌కు రూ.10 వేలు దాటుతుందని ఆశించిన రైతులు మార్కెట్‌లో రూ.7 వేల నుంచి రూ.8 వేలలోపే పలుకుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. పండుగ అవసరాల కోసం కొందరు కొంతమేర పత్తిని విక్రయించగా మిగతాది ఇళ్లవద్దే నిల్వ చేసుకున్నారు. మరికొందరు పత్తిని ఏరకుండా చేలల్లోనే ఉంచారు. ధర పెరుగుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

కొత్తూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

- తన చావుకు ఎవరూ కారణం కాదంటూ సూసైడ్ నోట్


సతీశ్ (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన పొట్టాల సతీశ్(25) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పొట్టాల భీరయ్య–రాజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు సతీశ్ వర్క్ ఫ్రం హోం విధానంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు శుక్రవారం వ్యవసాయ పనులకు వెళ్లగా అతను ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. వారు సాయంత్రం వచ్చేసరికి ఉరేసుకున్నాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై అశ్విని సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతుడి వద్ద తన చావుకు ఎవరూ కారణం కాదని రాసిన సూసైడ్ నోట్ లభించిందని పేర్కొన్నారు. కాగా తమ కుమారుడి ఆత్మహత్యకు కారణం తెలియదని, పోలీసులు విచారణ జరపాలని మృతుడి తండ్రి కోరాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతిచెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. దూలం తిరుపతి(24) గురువారం రాత్రి ఇంట్లో కరెంటు వైర్లకు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సంభవించింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు..


ప్రవీణ్ (ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఎండపల్లి మండలంలోని పాతగూడూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాతగూడూర్‌కు చెందిన ఉప్పుమల్ల ప్రవీణ్(34) మనోవైకల్యంతో బాధ పడుతున్నాడు. అప్పుడప్పుడు ఇంటినుంచి వెళ్లి రెండు, మూడు రోజులకు తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పొలానికి నీరు పెట్టేందుకు స్కూటీపై వెళ్లి, తిరిగిరాలేదు. ఎప్పటిలాగే వస్తాడని కుటుంబసభ్యులు అనుకున్నారు. కానీ రాకపోవడంతో శుక్రవారం స్థానికంగా వెతికారు. వ్యవసాయ బావిలో చూడగా ప్రవీణ్ మృతదేహం కనిపించింది. ఇంటి నుంచి వెళ్లినరోజే ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెంది ఉంటాడని మృతుడి తండ్రి బాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ పేర్కొన్నారు.

ఖరీదైన వైద్యం అందక గీత కార్మికుడు..


రవిగౌడ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పక్షవాతానికి గురైన ఓ గీత కార్మికుడు ఖరీదైన వైద్యం అందక మృతిచెందిన ఘటన ఎల్లారెడ్డిపేటలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలకేంద్రానికి చెందిన పుల్లకు రవిగౌడ్ (51) కులవృత్తిని నమ్ముకొని, కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో 15 ఏళ్ల క్రితం పక్షవాతంతో మంచం పట్టాడు. అప్పుచేసి, ఉన్న ఎకరం భూమి అమ్మి ఆసుపత్రుల్లో చికిత్స చేయించినప్పటికీ నయం కాలేదు. దీంతో హైదరాబాద్‌కు వెళ్లి, ఖరీదైన వైద్యం చేయించుకోవాలని డాక్టర్లు సూచించారు. కానీ ఆర్థిక ఇబ్బందులతో ఇంటివద్దే ఉండిపోయాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య ప్రేమల, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఆ కుటుంబం రోడ్డున పడింది. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

ఇల్లందకుంట(హుజూరాబాద్): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన కనుమల్ల పోశెట్టి(52) కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక నిత్యం మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి ఒక కూతురు కాగా వివాహమైంది. శుక్రవారం పోశెట్టి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

కాంట్రాక్టర్ కనకయ్య ఆదర్శప్రాయుడు

- రామగుండం మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు


ప్రశంసాపత్రం అందిస్తున్న కమిషనర్ సుమన్‌రావు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో సివిల్ కాంట్రాక్టర్‌గా పని చేసిన జంగపల్లి అలియాస్ గడ్డి కనకయ్య మన మధ్య లేకపోయినా ఇద్దరు అంధులకు చూపునిచ్చిన ఆదర్శప్రాయుడని కమిషనర్ సుమన్‌రావు కొనియాడారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు లింగమూర్తి, వాసుల ఆధ్వర్యంలో గౌతమినగర్‌లో శుక్రవారం కనకయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కనకయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆయన నేత్రాలను దానం చేసిన భార్య సరోజన, కుమారుడు అవినాష్, కూతుళ్లు గౌతమి, అంజలి, పావని, అల్లుడు గణేశ్‌లను అభినందించారు. ట్రాఫిక్ ఎస్సై నాగరాజు, నాయకులు అమరేందర్‌రావు, పీటీ స్వామి, తానిపార్తి గోపాల్‌రావు తదితరులు కనకయ్య సేవలను కొనియాడారు. అనంతరం కమిషనర్ ఆయన కుటుంబసభ్యులకు సదాశయ ఫౌండేషన్ తరఫున ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ఇంటి విద్యుత్ కనెక్షన్‌ను వ్యాపారానికి వాడొద్దు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారని ట్రాన్స్‌కో ఎస్‌ఈ బొంకూరి సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి అవసరాల కోసం కేటగిరీ–1 ద్వారా విద్యుత్ కనెక్షన్ పొందిన వినియోగదారులు గృహేతర అవసరాల కోసం (ఫాస్ట్‌ఫుడ్, కంగన్ హాల్, టైలరింగ్, చిన్న కిరాణం వంటి వ్యాపారాలకు) విద్యుత్‌ను వాడుకోవడం నేరమన్నారు. తమ ఇల్లు ప్రధాన రోడ్డు పక్కన ఉండి, షట్టర్‌లో వ్యాపారం నిర్వహించేవారు కరెంటు మీటర్ కేటగిరీని గృహేతర కేటగిరీకి మార్చుకోవాలని పేర్కొన్నారు. లేకపోతే విజిలెన్స్ అధికారులు తనిఖీ సమయంలో గుర్తిస్తే కేసు నమోదు చేసి, జరిమానా విధిస్తారని అన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే పీడీయాక్టు


మాట్లాడుతున్న ఎస్సై వెంకటకృష్ణ

ఎలిగేడు/జూలపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎలిగేడు, జూలపల్లి మండలాల్లోని గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తే పీడీయాక్టు నమోదు చేస్తామని, చట్టపరంగా చర్యలు తప్పవని జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కోడి పందేల ఆటలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందని పేర్కొన్నారు. ఎలిగేడు మండలంలోని శివపల్లిలో కోడి పందేల నిరోధానికి గ్రామంలో రెండు రోజుల పాటు పోలీస్ పికెటింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. కోడి పందేల ఆటల్లో నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్నవారి కుటుంబాలు రోడ్డున పడ్డ ఘటనలు ఉన్నాయని, పచ్చని కుటుంబాల్లో చిచ్చు పెట్టే ఆటల్లో బెట్టింగులు పెట్టి అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎలిగేడు, జూలపల్లి మండలాల్లో పోలీసు పెట్రోలింగ్, తనిఖీలు, పహార ఉంటుందని వెల్లడించారు.